# ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి: డీఎస్పీ



ఇచ్చోడ: వినాయక ఉత్సవాలను శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని డీఎస్పీ చంద్రప్రభు అన్నారు. ఆయన ఇచ్చోడలోని విఠల్‌రెడ్డి గార్డెన్‌లో పోలీస్‌శాఖ తరపున నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని తెలిపారు. నిబంధనలు పాటించాలని అన్నారు. వినాయక మండపాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్వాహకులు వారి వివరాలను పోలీసులకు అందజేయాలన్నారు. బక్రీద్ పండగ సైతం వినాయక ఉత్సవాల సమయంలో రానుండడంతో హిందూ, ముస్లింలందరు కలిసికట్టుగా ఘనంగా జరుపుకోవాలని కోరారు. మత సామరస్యతను పాటిస్తూ ఆదర్శంగా నిలువాలని అన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు కలిగితే పోలీసులకు వెంటనే తెలియజేయాలని తెలిపారు. పంచాయతీ, విద్యుత్తు శాఖల వారు వినాయక ఉత్సవాలకు అవసరమయ్యే వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, గణేష్ నిర్వాహకులు వారి సూచనలను, సలహాలు అందజేశారు. వినాయక నిమజ్జనంతో పాటు ఉత్సవాల్లో ఎదురయ్యే సమస్యలను అధికారులకు వివరించారు. డీజే సంగీతానికి అనుమతించాలని యువత కోరడంతో ముందస్తుగా డీఎస్పీకి దరఖాస్తు చేసుకుంటే రెండు స్పీకర్‌లకు మాత్రమే అనుమతి ఇవ్వనున్నట్లుగా సీఐ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. నిమజ్జనానికి క్రేన్, ర్యాంపు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాథోడ్ మోహన్‌సింగ్, ఎంపీడీఓ లింగయ్య, సర్పంచి చౌహాన్ సునీత, ఏఈ మనోహర్, అగ్నిమాపకశాఖ అధికారి సుధాకర్, ఎక్సైజ్ ఎస్సై హనుమంత్‌రావ్, ఎస్సై మోహన్, వైస్ ఎంపీపీ దేవానంద్, ఎంపీటీసీ సభ్యుడు దయాకర్‌రెడ్డి, ఉప సర్పంచి ఏనుగు కృష్ణారెడ్డి, తెరాస మండల అధ్యక్షుడు మెరాజ్‌అహ్మద్, సొసైటీ డైరెక్టర్ అబ్దుల్ రషీద్, భాజపా జిల్లా నాయకులు అడె మానాజీ, మాధవ్‌రావ్ ఆమ్టె, మండల అధ్యక్షుడు కదం బాబారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుంట ప్రవీణ్‌రెడ్డి, శంషోద్దీన్, కుమ్ర కోటేశ్వర్, మహెమూద్‌ఖాన్, ఎంఐఎం మండల అధ్యక్షుడు షేక్ మౌసిన్, జమాతె ఇస్లామీ గౌరవధ్యక్షుడు షేక్ శంషోద్దీన్‌తో పాటు ఆయా గ్రామాల వినాయక మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## తట్టు, రుబెల్లా టీకాల కార్యక్రమానికి శ్రీకారం

ఉట్నూరు : వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన తట్టు, రూబెల్లా టీకాల కార్యక్రమాన్ని ఉట్నూరులోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆదిమ గిరిజన సంక్షేమ, సలహా కమిటీ ఛైర్మన్ కనక లక్కేరావు ముఖ్య అతిథిగా హాజరుకాగా ఆయనతోపాటు ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి కుమ్ర బాలు, ఐటీడీఏ డీడీ పోచం, జిల్లా ఉపవైద్యాధికారి వసంత్‌రావు, జిల్లా మలేరియాధికారి అలహం రవి, వైద్యాధికారి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు బొంత ఆశారెడ్డి, మర్సుకోల తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏటీడబ్ల్యూఏసీ ఛైర్మన్ మాట్లాడుతూ.. ఎంఆర్ టీకాలను తొమ్మిది నెలల వయస్సు నిండిన పిల్లల నుంచి మొదలుకొని 15 ఏళ్లు కలిగిన బాలబాలికలు అందరు వేయించుకోవాలన్నారు. ఈ ఒక్క టీకాతో తట్టు, రుబెల్లా రెండు వ్యాధులు దూరమవుతాయన్నారు. ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి మాట్లాడుతూ.. నేటి నుంచి వచ్చేనెల 25వరకు ఈ టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినికి ఏఎన్ఎం పావణితో ఎంఆర్ టీకాను వేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గౌస్, వసతిగృహ సంక్షేమాధికారిణి యశోద, దంతన్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్, హెచ్ఈఓ గోకుల్, సత్యనారాయణ, హెచ్ఈ బుక్క వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 80 లక్షల మొక్కలు నాటిన సింగరేణి



కొత్తగూడెం : కోటి మొక్కలను నాటే లక్ష్యంతో ఉన్న సింగరేణి శుక్రవారం నాటికి 80 లక్షల మొక్కలను నాటింది. సింగరేణి వ్యాప్తంగా గడిచిన సంవత్సరం కోటి మొక్కలను నాటిన సింగరేణి ఈ సంవత్సరం కూడా కోటి మొక్కలను నాటేందుకు నిర్ణయించుకొన్న విషయం తెలిసిందే. ఇందులోభాగంగా ఆరు జిల్లాల్లో విస్తరించిన సింగరేణిలో గడిచిన నెలనుంచి మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. తాజాగా శుక్రవారం నాటికి 80 లక్షల మొక్కలను నాటింది. సింగరేణి విస్తరించిన 11 ఏరియాల్లో కెల్లా భూపాలపల్లి ఏరియాలో అత్యధికంగా మొక్కలను నాటింది. గురువారం నాటికి భూపాలపల్లి ఏరియాలో 8.68 లక్షలు నాటారు.

కొత్తగూడెం ఏరియాలో 6,53,104, బెల్లంపల్లి ఏరియాలో 4,98,500, శ్రీరాంపూర్ ఏరియాలో 3,70,735, మణుగూరు ఏరియాలో 3,61,700, ఇల్లెందు ఏరియాలో 3,53,450, మందమర్రి ఏరియాలో 3,16,366 మొక్కలను నాటారు. రామగుండం 2 ఏరియాలో 2,98,000 మొక్కలను, కార్పొరేట ఏరియాలో 2,93,238, రామగుండం1 ఏరియాలో 2,79,000, రామగుండం3 ఏరియాలో 2,29,000 మొక్కలను నాటారు. వివిధ ఏరియాల్లో 35,50,000 మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు.

## కళాశాలల్లో మధ్యాహ్నం భోజనం పెట్టాలి



ఆదిలాబాద్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నభోజన పథకం అమలు చేయాలని తెలంగాణ విద్యార్థి వేదిక (తెవివే) జిల్లాఅధ్యక్షుడు బి.రాహుల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదిలాబాద్ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఈ సమావేశానికి హాజరైన ఆయన కళాశాలల్లో నెలకొన్న సమస్యలపై పోరాటం చేయాలని నూతన సభ్యులకు పిలుపునిచ్చారు. పేద విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలకు వస్తారని, వారు నిరంతరంగా తరగతులకు హాజరుకావాలంటే మధ్యాహ్నం పూట భోజనం పెట్టడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు.

ఆదిలాబాద్ పట్టణ తెవివే నూతన అధ్యక్షుడిగా తబ్రేజ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా కె.నితేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా జి.సుశీల్, లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా సీహెచ్ సాయికుమార్, కోశాధికారిగా ఎస్.అజయ్, సభ్యులుగా రాష్ట్రపాల్, సిద్ధాంత్, రిజ్వాన్ ఎన్నికయ్యారు.

## వేతనాల్లో కోతలను నిరసిస్తూ విధుల బహిష్కరణ

### ఆందోళనకు దిగిన రిమ్స్ భద్రత సిబ్బంది

ఎదులాపురం : తమ వేతనాల్లో గుత్తేదారు కోతలు విధించడాన్ని నిరసిస్తూ రిమ్స్ భద్రత సిబ్బంది విధులు బహిష్కరించారు. రిమ్స్‌లో మొత్తం 48 మంది భద్రత సిబ్బంది పని చేస్తుండగా ఈ నెల వేతనాల్లో గుత్తేదారు 40 మందికి ఒక్కొక్కరికి రూ.ఒక వేయి చొప్పున తక్కువగా బ్యాంకు ఖాతాల్లో జమచేశారని, మరో ఎనిమిది మందికి నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని వారు వాపోయారు. ఈ విషయం రిమ్స్ సంచాలకుడు కె.అశోక్ దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేకపోవటంతో వారంతా విధులు బహిష్కరించారు. రిమ్స్‌లోనే సమావేశమై ఆందోళనకు దిగారు. అరకొర వేతనాలతో జీవితాలు గడుపుతున్న తమ వేతనాల్లో కోతలు పెట్టటం అన్యాయమని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయం రిమ్స్ సంచాలకుడు అశోక్ దృష్టికి తీసుకెళ్లగా వేతనాల్లో కోత విధించిన విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఈ విషయంలో పరిశీలించి న్యాయం చేకూరుస్తానని హామీ ఇచ్చారు.

## సార్వత్రిక విద్య ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం : సార్వత్రిక విద్యలో పది, ఇంటర్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి హయగ్రీవాచార్య తెలిపారు. 2017-18 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు మీ సేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు సమర్పించడగానికి ముందుగా విద్యార్హతల సర్టిఫికెట్లను సరిచూసుకోవాలన్నారు. దరఖాస్తుల సమర్పణకు సెప్టెంబరు 4న ఆఖరు తేదీ అని, ఆలస్య రుసుంతో సెప్టెంబరు 21 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పదో తరగతికి ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఎక్స్‌సర్వీస్‌మెన్, పీహెచ్‌సీ, అన్ని వర్గాల మహిళా అభ్యర్థులకు: రూ.700, ఓసీ(మెన్): రూ.1100, ఆలస్య రుసుం రూ.100. ఇంటర్మీడియెట్‌కు ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఎక్స్ సర్వీస్‌మెన్, పీహెచ్‌సీ, అన్ని వర్గాల మహిళా అభ్యర్థులకు: రూ.1000 ఓసీ(మెన్)రూ.1300, ఆలస్య రుసుం రూ.200. పైన పేర్కొన్న ఫీజులతోపాటు ఆన్‌లైన్ చేయడానికి అదనపు రుసుం చెల్లించాల్సి ఉంటుందని, గుర్తింపు ఉన్న ఓపెన్ స్కూల్, ఉన్నత పాఠశాలలు, కళాశాలల వారిని మాత్రమే సంప్రదించాలన్నారు. మధ్యవర్తులను, దళారులను ఆశ్రయించొద్దని డీఈఓ సూచించారు.

## ఉద్యమం ఆగదు

పుల్కల్: సంగారెడ్డికి ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు కోరుతూ మాజీ విప్ జగ్గారెడ్డి సంగారెడ్డిలో ఆమరణ నిరాహార దీక్ష ప్రయత్నం చేయగా.. పోలీసులు అరెస్టు చేసి పుల్కల్ ఠాణాకు జోగిపేట సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో వాహనంలో తీసుకొచ్చారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడారు. సంగారెడ్డికి రావాల్సిన ప్రభుత్వ వైద్య కళాశాలను మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటకు తరలిస్తున్నారని ఆరోపించారు. సంగారెడ్డికి వైద్య కళాశాల సాధించే వరకు వరకు పోరాటం ఆగదన్నారు. విడతల వారీగా విభిన్న రీతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. జిల్లాల ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట జిల్లాకు పూర్తిగా నిధులు తరలిస్తున్నారని ఆరోపించారు. సంగారెడ్డిని పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు.

## విస్తృత ఏర్పాట్ల నడుమ గణేష్ ఉత్సవాలు



ఆదిలాబాద్ : విస్తృత ఏర్పాట్ల నడుమ గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తామని ఆదిలాబాద్ జిల్లా పోలీసు ఉన్నతాధికారి శ్రీనివాస్ తెలిపారు. వివిధ పార్టీల రాజకీయ నాయకులు, కులసంఘాలు, మత పెద్దలు, అధికారులతో జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన శాంతి కమిటీ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. గణేశ్ నవరాత్రుల సమయంలో భారీ స్థాయి శబ్దాలతో కూడిన డీజేలకు అనుమతి ఎట్టి పరిస్థితిలో ఇవ్వబోమన్నారు. గణేశ్ మండపాల వద్ద పేకాట, మద్యం సేవించడం తదితరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, నిత్యం ప్రత్యేక పోలీసులు మండపం పరిసరాలను పర్యవేక్షిస్తారని చెప్పారు. పాటలు, రికార్డింగ్ డాన్సుల పేరిట అనాధిగా వస్తున్న ఆచారాలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా ప్రమాదకర వాతావరణం ఎదురైతే సమీపంలో ఉన్నవారు వెంటనే స్పంధించి పోలీస్ వాట్సాప్ 8333986898 నెంబరుకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మూర్తి, ఆర్అండ్‌బీ ఇంజినీర్ సురేష్, డీఈ వెంకటరమణ, తహసీల్దార్‌లు వర్ణ, శ్రీదేవి, సీఐలు పురుషోత్తం, సురేష్, కుల, మత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఒడిశా నుంచి ముంబయికి గంజాయి తరలింపు



ఖమ్మం : ఒడిశాలోని బరంపురం నుంచి ముంబయికి అక్రమంగా తరలిస్తున్న 45 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. విజయవాడ శివారు నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను జీఆర్‌పీ ప్రత్యేక పోలీసుబృందం తనిఖీలు నిర్వహించింది. ఈ సమయంలో ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి పిల్లలతో కలిసి దుస్తుల బ్యాగుల్లో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఖమ్మం జీఆర్‌పీ సీఐ చంద్రభాను వివరాలను వెల్లడించారు. కోణార్క్, ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లలో గంజాయి అక్రమంగా తరలిస్తున్నారన్న ఉన్నతాధికారుల సమాచారంతో ఖాజీపేట రైల్వే డీఎస్పీ, ఖమ్మం, డోర్నకల్ ఎస్సైల నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రైళ్లలో తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మధిర రైల్వే స్టేషన్ దాటిన తరువాత కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు నిర్వహిస్తుండగా, ఎస్10బోగీలో సీటు కింద గోధుమరంగు ట్రాలీబ్యాగును అనుమానంతో సోదాచేశారు. అందులో మూడు కాటన్ బాక్సుల గంజాయిని ప్యాకింగ్ చేసి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా చెన్నామర్రి గ్రామానికి చెందిన రంజన్‌కుమార్‌సాహు(33), అతనిబార్య గీతాంజలిసాహు, మరోమహిళ రంజుక్తసాహు ఆ బ్యాగు తమదేనని ఒప్పుకోవడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులో రూ.1.90 లక్షల విలువైన 45కేజీల గంజాయి ఉన్నట్లు నిర్ధారించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ చంద్రభాను వెల్లడించారు.

## దొంగ పట్టాలపై విచారణకు ఆదేశం

ఆదిలాబాద్: ప్రభుత్వ స్థలాల్లో బోగస్ పట్టాలు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్న వ్యవహారంపై ఎట్టకేలకు అధికారులు స్పందించారు. సమగ్రంగా సర్వే జరిపి అవకతవకలను వెలికి తీయడానికి రెవెన్యూ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఆరుగురితో కూడిన ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. వారం పదిరోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక తయారు చేయాలని జిల్లా సంయుక్త పాలనాధికారి కృష్ణారెడ్డి, ఆర్డీవో సూర్యనారాయణ గురువారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో అప్పుడే వణుకు మొదలైంది.

ఆదిలాబాద్ పట్టణానికి ఆనుకుని ఉన్న మావల గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 120లో 49 ఎకరాలు కొనుగోలు చేసి వాటిని ఇళ్ల స్థలాలుగా మార్చారు. ఇక్కడ దొంగ పట్టాలు తయారు చేసి ఒక ప్లాటునే ముగ్గురు నలుగురికి అమ్మేస్తూ ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలం దొరక్క అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టింపులేకుండాపోయింది. దీంతో జిల్లా సంయుక్త పాలనాధికారి కృష్ణారెడ్డి, ఆర్డీవో సూర్యనారాయణలు ప్రత్యేక బృందాలను నియమించి సర్వేకు ఆదేశించారు. బజార్‌హత్నూర్ మండలం ఆర్ఐ రాజేశ్వరి, డీటీ సంతోశ్, వీఆర్వో శ్రీనివాస్, గుడిహత్నూర్ ఆర్ఐ రాములు, డీటీ నరేందర్, ఇచ్చోడ మండలం ఆర్ఐ ఉల్లాస్, డీటీ రామారావులను విచారణ అధికారులుగా నియమించారు. ఈ ఆరుగురు బృందాలుగా విడిపోయి క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నారు. 2013లో ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను ఆధారం చేసుకుని కేటాయించిన స్థలాల్లో ఎంతమంది ఉంటున్నారు..? ఎంతమంది స్థలాలను విక్రయించారో తెలుసుకోనున్నారు. ఎవరెవరి వద్ద ఏ విధమైన ఇంటి స్థలానికి సంబంధించిన పట్టాలున్నాయి..? అవి దొంగ సంతకాలతో పోర్జరీ చేసినవా..? వాటిని జారీ చేసిన అధికారి ఎవరు..? వాళ్లకు ఏవిధంగా పట్టాలు సంక్రమించాయనే విషయాలను సమగ్రంగా విచారించనున్నారు. ఈ వ్యవహారం రాష్ట్ర రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లడంతో వాళ్ల సైతం తీవ్రంగా పరిగణించారు. పూర్తివిచారణ జరపాలని జిల్లా అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

ఈ కాలనీ విషయంలో ఇప్పటికే గతంలో మూడు సార్లు సర్వేజరిపారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సమగ్రంగా సర్వే చేయకుండా మధ్యలోనే వదిలేశారు. దీంతో అక్రమార్కుల వ్యవహారం బయటకు రాలేదు. ప్రస్తుతం సర్వేలో కేవలం రెవెన్యూ అధికారులకే అప్పగించారు. అది కూడా ఆర్ఐ, డీటీ, వీఆర్వో స్థాయిగలిగిన వాళ్లకే అప్పగించారు. ప్రస్తుతం విచారణ కమిటీలో ఉన్న కొందరికి అక్రమార్కులతో సన్నిహిత సంబంధాలున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఈ విషయంలో మిగిలిన కొన్ని శాఖలతో సంయుక్తంగా సర్వే జరిపితే అవకతవకాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఆ దిశగా అధికారులు పునఃపరిశీలించాల్సిన అవసరముంది.

## రామాలయంలో వైభవంగా పూజలు



భద్రాచలం : పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో బాలకృష్ణ నటించిన పైసా వసూల్ ఆడియో విడుదలను పురస్కరించుకుని భవ్య క్రియేషన్స్ ప్రతినిధులు సాయి అనంత్, నరేశ్, ఉపేందర్ భద్రాచలం వచ్చి రామాలయాన్ని దర్శించుకున్నారు. ఆ చిత్రంలోని పాటల సీడీలను రాములవారి పాదాల వద్ద ఉంచి ఆడియోతో పాటు సినిమా ఘన విజయం సాధించాలని పూజలు చేశారు. వీరికి అర్చకులు ఆశీర్వచనం అందించారు. వీరి వెంట తెదేపా నాయకులు కొడాలి శ్రీనివాసన్, కంభంపాటి సురేశ్, రాము, జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ ఉన్నారు. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరధర్ గమాంగ్, దిల్లీలోని తెలంగాణ అధికార ప్రతినిధి రామచంద్రుడు రామాలయాన్ని దర్శించుకోవడంతో రెవెన్యూ అధికారులు ప్రొటోకాల్ విధులు నిర్వహించారు. ఈవో ప్రభాకర శ్రీనివాస్ ఘన స్వాగతం పలకగా ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు వీరిద్దరకీ పరివట్టం కట్టి ఆశీర్వచనం అందించారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. గిరిధర్ గమాంగ్ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి శిల్పకళకు ముగ్ధులయ్యారు. చాలాచోట్ల నవీన ఆలయాలు ఉండగా భద్రాచలంలో ఎంతో ప్రాశస్త్యం గల కోవెలను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. శ్రీరామ దర్శనం సంతోషం కలిగించిందన్నారు.

గిరిధర్ గొమాంగ్‌ను తెలంగాణ అధికార ప్రతినిధి రామచంద్రు దగ్గరుండి దర్శనం చేయించి తమ మైత్రిని చాటారు. రామచంద్రుడు వెంట తెరాస నాయకులు మానె రామకృష్ణ ఉన్నారు. హన్మకొండకు చెందిన భక్తుడు సుధీర్ కుటుంబ సభ్యులతో వచ్చి దర్శనం చేసుకుని అన్నదానం నిమిత్తం రూ.1,00,116 విరాళాన్ని ఏఈ నరసింహరాజు, ఇన్‌స్పెక్టర్ శేఖర్ చేతుల మీదుగా స్వామివారికి సమర్పించారు. ఉదయం ప్రధాన ఆలయంలో స్వామివారికి అర్చకులు సుప్రభాతం నిర్వహించి ఆరాధన చేసి నామార్చనలు నిర్వహించారు. క్షేత్ర విశిష్టత అలరించింది. విష్వక్సేన పూజ చేసి పుణ్యాహ వాచనం చేసి కంకణ ధారణ జరిపారు. కన్యాదానం నిర్వహించి ప్రవరను పఠించి కల్యాణ క్రతువులో అత్యంత కీలక ఘట్టాలను వివరిస్తు మాంగళ్యధారణ నిర్వహించారు. దర్బారు సేవ పరమానంద భరితులను చేయగా హరిదాసుల కీర్తనలు మంత్రముగ్ధులను చేశాయి. నేడు శ్రావణమాసంలోని ఆఖరి శుక్రవారం పూజలు నిర్వహించేందుక యంత్రాంగం చర్యలు చేపట్టింది.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# కిలిమంజారోపై మెతుకుసీమ యువకుడు



మెదక్ : మెతుకుసీమ యువకుడు ప్రపంచంలో ఎత్తయిన పర్వతాల్లో ఒకటైన కిలిమంజారో ఆధిరోహించి ప్రత్యేకత చాటుకున్నాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం టి.మాందాపూర్ గ్రామానికి చెందిన బస్వరాజ్ ఈ ఘనత సాధించారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పూర్ణా, ఆనంద్‌ల స్ఫూర్తితో టాంజానియా దేశంలో ఉన్న సుమారు 20 వేల అడుగుల ఎత్తయిన కిలిమంజారో పర్వతాన్ని ఎక్కాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు పర్వతారోహణకు సంబంధించిన ప్రత్యేక శిక్షణ తీసుకుని, అనుమతులు పొందిన అతను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన యువకుల బృందంతో పాటు ఈనెల 11న బయలుదేరి వెళ్లాడు. స్వాతంత్ర దినోత్సవమైన ఆగస్టు 15న పర్వతంపైకి చేరుకుని అక్కడ భారత జాతీయ పతాకంతో పాటు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్, ప్రముఖ శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి ఏ.పి.జె.అబ్దుల్ కలాంల చిత్రాలను ప్రదర్శించారు. ఈ మేరకు పర్వతాన్ని అధిరోహించినట్లు అక్కడి అధికారులు బస్వరాజ్‌కు ధ్రువీ కరణ పత్రం అందజేశారు. ప్రపంచంలో రెండో ఎత్తయిన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడం తనకెంతో గర్వంగా ఉందని బస్వరాజ్ తెలిపారు. ఈ విజయం స్ఫూర్తితో వచ్చే ఏడాది ఎవరెస్ట్ శిఖర అధిరోహణకు వెళ్తానని చెప్పారు.

# తితిదే ధార్మిక విజ్ఞాన పరీక్షల ఫలితాలు విడుదల

## 21న ఉమ్మడి జిల్లాస్థాయిలో బహుమతి ప్రదానం

మహబూబ్‌నగర్ : తితిదే, హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయిలో నిర్వహించిన ధార్మిక విజ్ఞాన పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు తితిదే కార్యక్రమ జిల్లా సమన్వయకర్త ఉత్తరపల్లి రామాచారి తెలిపారు. విద్యార్థుల్లో ధార్మిక విజ్ఞానాన్ని పెంపొందించే నిమిత్తం గత ఏడాది ఈ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ధర్మపరిచయం పేరిట 6, 7 తరగతుల విద్యార్థులకు, ధర్మ ప్రవేశిక పేరిట 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా పరీక్షలు కొనసాగాయని అన్నారు. ఆయా పరీక్షల్లో ప్రతిభ చాటిన వారికి ఈ నెల 21న ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్‌లోని తితిదే కల్యాణ మండపంలో బహుమతులు ప్రదానం చేస్తామని వెల్లడించారు. ధర్మ పరిచయం పరీక్షలో జి.వంశిక (అపెక్స్ సెంట్రల్ స్కూల్, మహబూబ్‌నగర్), వి.సుష్మిత (మార్చాల), యు.స్వామి (మనికొండ), ధర్మప్రవేశికలో ఎండీ.అమీర్‌ఖాన్ (జడ్పీహెచ్‌ఎస్, వంగూరు), కె.గాయత్రి (జడ్పీహెచ్‌ఎస్, తెలకపల్లి), కె.కృష్ణవేణి (జడ్పీహెచ్‌ఎస్, పోల్కంపల్లి) విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికయ్యారని, వీరందరికి రూ.1000, రూ.750, రూ.500 నగదు బహుమతులతోపాటు ధ్రువీకరణ పత్రం, రవాణా ఖర్చులను ఇవ్వనున్నట్లు తెలిపారు.

# నిమ్స్ సాధనకు ఉద్యమాలు

## భాజపా జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యామ్‌సుందర్‌రావు



బీబీనగర్ : బీబీనగర్ మండలం రంగాపురంలోని నిమ్స్ ఆసుపత్రిలో ప్రభుత్వం పూర్తిస్థాయి వైద్య సేవలు ప్రారంభించేంత వరకు దశల వారిగా ఉద్యమాలు చేపడుతామని భాజపా జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యామ్‌సుందర్‌రావు తెలిపారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా చేపట్టిన పోస్ట్‌కార్డు ఉద్యమంలో సేకరించిన సుమారు 5 వేల పోస్ట్‌కార్డులను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందేలా బీబీనగర్ తపాలా కార్యాలయ అధికారికి అందించి మాట్లాడారు. నిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్య సేవలు ప్రారంభించాలని స్వయంగా ముఖ్యమంత్రికి లేఖల ద్వారా తెలిపేందుకు ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలను పోస్ట్‌కార్డుపై సేకరించామని పేర్కొన్నారు.

ఈ పోస్ట్‌కార్డులను చూసైనా ముఖ్యమంత్రి ఈ ప్రాంత ప్రజా వైద్యశాల నిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్య సేవలు ప్రారంభిస్తారేమోనని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకే ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి స్పందించకుంటే త్వరలో 10 వేల మందితో ఆయన కార్యాలయాన్ని ముట్టడించి, అక్కడే దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు పడాల నర్సింహరావు, వోబీసీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లేష్, మండల కార్యదర్శి సుదర్శన్, బీజవైఎమ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎలుగుల నరేందర్, పొట్ట నవీన్, యువమోర్చా మండల నాయకులు ఆకుల సాయి, ప్రభు, రవి, గణేష్, శివ, నరేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్రాభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలి: కలెక్టర్

నల్గొండ : నల్గొండ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కావాల్సిన ప్రతిపాదనలు, అంచనాలు రూపొందించాలని కలెక్టర్ గౌరవ్‌ఉప్పల్ అధికారులను ఆదేశించారు. భూగర్భ మురుగు నీటి పారుదల కాల్వల పనులు వేగవంతం చేయాలన్నారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ త్వరలో నల్గొండ పర్యటనకు రానున్న సందర్భంగా స్థానిక పురపాలిక కార్యాలయంలో అధికారులు, కౌన్సిలర్లతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి పుర సేవలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలో రెవెన్యూ, పారిశుద్ధ్య, పట్టణ ప్రణాళిక విభాగంలో అధికారులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని పుర ఛైర్‌పర్సన్ లక్ష్మి చెప్పారు. నల్గొండ సమగ్రాభివృద్ధికి ఎల్‌ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్ ద్వారా సమకూరిన రూ.12 కోట్లను వినియోగించుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. పట్టణంలో వరద కాల్వలు, టౌన్‌హాల్ నిర్మాణం, విలీన గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. కౌన్సిల్‌కు తెలియకుండా అమృత్ పథకం కింద పనులు చేపట్టారన్నారు. సిబ్బంది కొరత వల్ల పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతోందని చెప్పాఉ. ప్రకాశంబజారులోని పుర స్థలాల లీజుల టెండర్లను తెరిచేలా చర్యలు తీసుకుంటే మున్సిపాలిటీకి ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. మున్సిపాలిటీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా రక్షణ గోడలు నిర్మించాలని కోరారు. పురపాలిక కమిషనర్ రాజేంద్రకుమార్, ఆర్డీవో వెంకటాచారి, ఈఈ వెంకటేశ్వర్లు, పట్టణ ప్రణాళికాధికారి ప్రసాద్‌రావు, గ్రామీణ నీటిపారుదలశాఖ ఎస్‌ఈ పాపారావు, విద్యుత్తు సంస్థ ఏడీఈ నవీద్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా తీజ్

హుస్నాబాద్ : హుస్నాబాద్ పట్టణంలో తీజ్ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా శ్రావణ మాసంలో గిరిజనులు తొమ్మిదిరోజుల పాటు తీజ్ వేడుకలు జరుపుకుంటారు. ఇందులో భాగంగా గిరిజనుల సాంప్రదాయం ప్రకారం వెదురుబుట్టలో సేంద్రియ ఎరువును నింపి నానబెట్టిన గోధుమలు, శనగలు వేశారు. వాటికి గిరిజన కుల పెద్దలు పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పందిరిపై ఉంచారు. ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు అందరినీ అలరించాయి. ప్రతి రోజూ పెళ్లి కాని యువతులు ఉపవాసంతో రోజుకు మూడుసార్లు నీరు పోస్తారు. 8వ రోజు మట్టితో మారెమ్మ, సేవాలాల్ విగ్రహాలు తయారు చేసి పూజ చేస్తారు. దీన్ని గంగోళి అని పిలుస్తారు. 9 రోజున బుట్టలో పెరిగిన గోధుమ నారు (తీజ్)ను తీసి బతుకమ్మ మాదిరిగా పేర్చి వేడుక జరుపుకుంటారు. అనంతరం సమీపంలో చెరువులో నిమజ్జనం చేస్తారు. హుస్నాబాద్ పట్టణంలో స్థిరపడిన గిరిజన కుటుంబాలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. స్థానిక హన్మకొండ రోడ్‌లో ఎంపీపీ భూక్యా మంగ, రామవరం రోడ్‌లో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మాలోతు బీలు నాయక్ ఇంటి ఆవరణలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

# అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

## జాబ్‌మేళాకు తరలివచ్చిన యువత

నారాయణపురం : నిరుద్యోగ యువత ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తెలిపారు. సంస్థాన్ నారాయణపురంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కలెక్టర్, రాచకొండ కమిషనరేట్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాకు చౌటుప్పల్, పోచంపల్లి, రామన్నపేట, వలిగొండ మండలాల నుంచి నిరుద్యోగ యువతీ, యువకులు వేలాది మంది తరలొచ్చారు. విద్యార్హతలకు అనుగుణంగా 27 కంపెనీల ప్రతినిధులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. వివిధ రంగాలకు చెందిన ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 1,678 మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోగా 694 మందిని ఎంపిక చేశారు. వారికి వెంటనే ఉద్యోగ నియామక పత్రాన్ని ఆయా కంపెనీల ప్రతినిధులు అందజేశారు. అధికారులు వూహించిన దానికన్నా రెంటింపులో నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు తరలివచ్చారు. అనంతరం డీఆర్‌డీవో పీడీ వెంకట్రావ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడారు. తెరాస ప్రభుత్వంలో పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయని తెలిపారు. ఒక్క సమ్మేళనంలో 27 కంపెనీలు 694 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జిల్లా కలెక్టర్, పీడీ, పోలీస్‌శాఖ వారు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు.

# పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి...

హైదరాబాద్ : వినాయక చవితి, నిమజ్జనం, బక్రీద్ పండుగలను సామరస్య పూర్వకంగా జరుపుకొనేలా శాంతి సంఘం సభ్యులు కృషి చేయాలని కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వినాయక నవరాత్రులు, బక్రీద్ పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకొనేందుకు శాంతి సంఘం సభ్యులు ఇ చ్చే సూచనలను అధికారులు పాటించాలన్నారు. వినాయక మండపాల వద్ద పరిశుభ్రం చేసేందుకు పురపాలికలు, గ్రామ పంచాయతీలు ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యుత్తు శాఖ అధికారులతో అనుమతి తీసుకుని విద్యుత్తు సౌకర్యం పొందాలన్నారు.

ఎస్పీ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకొనేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఖీమ్యానాయక్, ఏఎస్పీ శ్రీనివాస్, డీపీవో గోపాల్, ఆర్‌డీవో వెంకటాచారి, లిగ్యానాయక్, శాంతిసంఘం సభ్యులు పాల్గొన్నారు.

# గోవర్ధనగిరిలో బియ్యం మిల్లుపై విజిలెన్స్ దాడి

## మిల్లు యజమానులపై క్రిమినల్ కేసులు



గోవర్ధనగిరి : గోవర్ధనగిరిలోని ఓ బియ్యం మిల్లులో అక్రమంగా నిల్వచేసిన 346 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని హైదరాబాద్ సీటీ-2 విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకొన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ, ఏఎస్‌వో రాజేందర్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ సీటీ-2 సీఐ శ్రీధర్, ఎస్పై విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలివేలుమంగ, జిల్లా ఉప వాణిజ్యశాఖ అధికారి సురేశ్ మిల్లుపై దాడులు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ, సీఐ శ్రీధర్ మాట్లాడారు. గోవర్ధనగిరిలోని శ్రీఉమా మహేశ్వరస్వామి బియ్యం మిల్లులో అక్రమాలు జరుగుతున్నాయని, వందల సంఖ్యలో పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ చిట్టిబాబు ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు చెప్పారు. మార్కెంటింగ్ శాఖ నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి సంబంధించిన బియ్యం ఇంకా ప్రభుత్వానికి 4 వేల బస్తాలు ఇవ్వాల్సి ఉండగా ఆ బియ్యాన్ని అక్రమంగా ఎక్కువ ధరకు విక్రయించి.. బయట పీడీఎస్ బియ్యం చౌకధరకు సేకరించి వాటిని రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి అమ్మేందుకు సిద్ధం చేసినట్లు గుర్తించామని వెల్లడించారు. వీటిపై గతేడాది 12న జిల్లా పౌర సరఫరాల శాఖ నుంచి శ్రీముఖాలు జారీచేసినట్లు చెప్పారు. 346 బియ్యం బస్తాలను తాము స్వాధీనం చేసుకొని మదనాపూర్ గోదాంకు లారీల్లో తరలించినట్లు తనూజ చెప్పారు. అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసిన మిల్లు యజమానులు గోపాల్‌రెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డిలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వీపనగండ్ల ఠాణాలో ఏఎస్‌వో రాజేందర్, జిల్లా అధికారి తనూజ ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ గోపాల్‌రెడ్డి తెలిపారు.

# ప్రతి చిన్నారికి టీకా వేయించాలి: కలెక్టర్

సూర్యాపేట : జిల్లాలో 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలు 2.56లక్షల మంది ఉన్నారని, వారందరికి తట్టు, రూబెల్లా రాకుండా ఎంఆర్ టీకాలు వేయించాలని జిల్లా పాలనాధికారి కె.సురేంద్రమోహన్ అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పిల్లలకు ఎంఆర్ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలందరికీ ఈ టీకాలను సూదుల ద్వారానే ఇవ్వాలని, అందుకే వీటిని 1365 సెషన్లలో ఇస్తారని తెలిపారు. విద్యాశాఖ, ఆరోగ్యశాఖ సమన్వయంతో టీకాలు వేయించాలన్నారు. అనంతరం పిల్లలకు టీకాలను వేయించారు. పురపాలిక అధ్యక్షురాలు గండూరి ప్రవళిక మాట్లాడుతూ పిల్లలందరూ ఈటీకాలు తప్పనిసరిగా వేయించేందుకు పురపాలిక సంఘం నుంచి సహకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి తండు మురళీమోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి బి.వెంకటనర్సమ్మ, కౌన్సిలర్ చల్లమల్ల నర్సింహ, వైద్యుడు సోమిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన్, లయన్స్ క్లబ్ కార్యదర్శి బండారు రాజా, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రాణాంతకమైన తట్టు, రుబెల్లా వ్యాధులు సోకకుండా పిల్లలకు టీకాలు తప్పక వేయించాలని జిల్లా పాలనాధికారి కె.సురేంద్రమోహన్ అన్నారు. లయన్స్ క్లబ్ సర్వీస్ సెంటర్ భవనంపై తట్టు, రుబెల్లా టీకాల ఆవశ్యకతను తెలిపే భారీ బెలూనును ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో పురపాలిక అధ్యక్షురాలు గండూరి ప్రవళిక, జిల్లా విద్యాశాఖ అధికారిని వెంకటనర్సమ్మ, లయన్స్ క్లబ్ రీజినల్ ఛైర్మన్ బండారు రాజా, క్లబ్‌అధ్యక్షుడు పటేల్ నర్సింహారెడ్డి, పాల్గొన్నారు.

# దళిత వ్యతిరేకిగా రాష్ట్ర ప్రభుత్వం

యాదగిరిగుట్ట : సిరిసిల్లలో జరిగిన దాడులతో ప్రాణాపాయ పరిస్థితిల్లో దళితులు వెళ్లినప్పటికీ సీఎం స్పందించకపోవడం దారుణమని, ప్రభుత్వం దళిత వ్యతిరేకిగా పని చేస్తోందని భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వేముల అశోక్ ధ్వజమెత్తారు. యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితున్ని సీఎం చేస్తానని, మూడెకరాల భూమిని ఉచితంగా పంపిణీ చేస్తానని, రెండు పడకల గదుల పథకంలో దళితులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని నమ్మబలికి కేవలం రాజ్యాధికారం కోసం దళితులను సీఎం కేసీఆర్ పావులుగా వాడుకున్నారని విమర్శించారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కూడా పక్కదారి పట్టించి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కేవలం శాసనసభలో తూతూ మంత్రంగా తీర్మాణం జరిపి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. భాజపా దళితులకు సముచిత స్థానం, సంక్షేమానికి పేద్దపీఠ వేస్తోందని, రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. 19న యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరి గార్డెన్‌లో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గసమావేశం నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు.

కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్య దర్శి కంబాలపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు డి.నాగేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు రావుల సత్తయ్య, కూరం పరమేశ్, రచ్చ శ్రీనివాస్, రాఘవుల నరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# టీకా...ఆరోగ్య తెలంగాణకు బాట



సంగారెడ్డి : పిల్లలకు తట్టు, పొంగు సోకకుండా వ్యాధి నిరోధకత పెంచే టీకాలను వేయించేందుకు తల్లిదండ్రులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, ఆరోగ్య తెలంగాణకు బాటలు వేయాలని పాలనాధికారి మాణిక్కరాజ్ పిలుపు నిచ్చారు. పిల్లలకు చక్కటి ఆరోగ్యాన్ని ఇవ్వాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని గుర్తుచేశారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో తట్టు, పొంగు(మీజిల్, రుబెల్లా) టీకాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ... వ్యాధులు వచ్చిన తర్వాత బాధపడటం కంటే రాకుండా ముందస్తుగా టీకాలు వేయించడం ఎంతో ఉపయోగకరమన్నారు. జిల్లాలో తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలు నాలుగు లక్షలకు పైగా ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ గుర్తించిందని, వారందరికీ టీకాలు వేస్తామని స్పష్టం చేశారు. విదేశాల్లో ఆయా తట్టు, పొంగు వ్యాధులను దరిచేరకుండా అమలు చేస్తున్నారని, మన దేశంలోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోనూ ఈ కార్యక్రమం విజయవంతంగా అమలవుతోందని గుర్తుచేశారు. టీకాల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామంటూ జిల్లా వైద్యాధికారి మోజీరాం రాథోడ్ తెలిపారు. నిర్ణీత షెడ్యూల్డ్ మేరకు గ్రామాలు, పట్టణాల్లో తమ సిబ్బంది టీకాలు వేసేందుకు వస్తారని, వారికి సహకరించాలని కోరారు. ఎలాంటి సమస్యలున్నా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంప్రదించాలని సూచించారు. చిన్న పిల్లల వైద్యుడు చక్రపాణి మాటాడుతూ... ఎంఆర్ టీకా చాలా విలువైందని, వేసుకునేందుకు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులున్నా తమను సంప్రదిస్తే వైద్య సహాయం అందిస్తామని అభయమిచ్చారు. కార్యక్రమంలో డీఈఓ విజయకుమారి, మహిళా సంక్షేమాధికారిణి మోతి, వైద్యాధికారులు సరళకుమారి, హిరణ్మయి, కె.రాజుగౌడ్, ఎంఎన్‌ఆర్ కళాశాల హెచ్‌ఓడీ ఇందిర, తహసీల్దార్ విజయ్‌కుమార్, సెయింట్ ఆంథోనీస్ పాఠశాల ప్రిన్సిపల్ ఈ.అంథోనిరెడ్డి వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జగ్గారెడ్డి అరెస్టుతో స్వల్ప ఉద్రిక్తత

# నిరాహార దీక్ష యత్నాన్ని అడ్డుకున్న పోలీసులు



సంగారెడ్డి : సంగారెడ్డి పట్టణానికి వైద్య కళాశాల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ విప్ జగ్గారెడ్డి ఆమరణ నిరహార దీక్ష యత్నం చేయగా.. పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. జగ్గారెడ్డితో పాటు ఆ పార్టీ శ్రేణులు భారీగా సంగారెడ్డికి చేరుకున్నారు. మాజీ విప్ జగ్గారెడ్డి, ఆయన సతీమణి నిర్మలారెడ్డి, రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి ఉజ్మా జాకీర్‌తో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంగారెడ్డిలోని రామమందిరం నుంచి ర్యాలీగా జిల్లా కలెక్టరేట్‌కు బయల్దేరారు. పట్టణ పోలీసు స్టేషన్‌కు సమీపంలో పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. పోలీసులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. జగ్గారెడ్డిని పోలీసులు అరెస్టు చేసేందుకు విశ్వప్రయత్నం చేయగా.. కార్యకర్తలు అడ్డుకున్నారు. దాదాపు అరగంటసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. జగ్గారెడ్డిని అరెస్టు చేసి పుల్కల్ ఠాణాకు తరలించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి కంది మండలంలోని ఇంద్రకరణ్ ఠాణాకు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట అరగంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ నిరసనలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు తోపాజీ అనంతకిషన్, మాజీ ఎంపీపీ జూలకంటి ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్.కె.సాబేర్, మండల పార్టీ అధ్యక్షుడు భిక్షపతి, సదాశివపేట జడ్పీటీసీ సంగమేశ్వర్, జిల్లా నాయకులు రుద్రారం ప్రకాశ్, బ్యాతోల్ చంద్రయ్య, పట్టణ అధ్యక్షుడు జార్జి మ్యాథ్యూస్, టీజేఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

జగ్గారెడ్డి చేపట్టనున్న ర్యాలీ, ఆమరణ దీక్షకు అనుమతి లేదని ముందస్తుగానే సంగారెడ్డి డీఎస్పీ తిరుపతన్న ప్రకటించిన విషయం తెలిసిందే. ముందస్తుగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో.. పోలీసులు అదే స్థాయిలో భద్రతను పెంచారు. ఉదయం 9 గంటలకు సంగారెడ్డి పట్టణ ఠాణా వద్ద బందోబస్తు నిర్వహించారు. సంగారెడ్డి పట్టణం, గ్రామీణంతో పాటు, కొండాపూర్, సదాశివపేట, జిన్నారం, ఇంద్రకరణ్, తదితర పోలీసు ఠాణాల నుంచి సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు దాదాపు 200 మందిని మోహరించారు.

